## బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4 : బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే జయంతి వేడుకలకు తగిన ఏర్పాట్లు చేయాలని అయా శాఖల అధికారులను ఆదేశించారు.

## ఉద్యమకారులకు నివాళి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 4 : కాగజ్‌నగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుల భవనంలో 1969 ఉద్యమకారులకు గురువారం నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ, ప్రతినిధులు కలికోట రమణయ్య, దేవయ్య, బాలరాజు, నాగేశ్వర్‌రావు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కావాలని జనవరి 1969లో విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమం ఉధృతమై పోలీసు కాల్పులకు దారి తీయడంతో అనేక మంది ఉద్యమకారులు బలయ్యారని గుర్తు చేశారు.

## సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 4 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీలో నాన్ సెమిస్టర్ విధానంలో డిగ్రీలో ప్రవేశం పొంది డిగ్రీ ఫెయిల్ అయిన 2015-16 అంతకు ముందు బ్యాచ్ విద్యార్థులు తమ పరీక్ష పీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ దత్తాత్రేయ కోరారు. ఈ నెల 26వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

## రైతులు జాగ్రత్తగా ఉండాలి

దహెగాం, ఏప్రిల్ 4 : అడవి ఏనుగు తిరుతున్నందున రైతులు, పశుకాపరులు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ కుందారపు రాజు అన్నారు. బుధవారం చింతల మానెపల్లి మండలం బూరెపల్లి గ్రామానికి చెందిన రైతులు, గురవారం పెంచికల్‌పేట మండలం కొండెపల్లికి చెందిన మరో రైతు ఏనుగు దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. ఆ ఏనుగు ఎటునుంచి ఎక్కడికి వచ్చే విషయం తెలియదని అందుకే పంట చేన్లు, పొలాల వద్దకు వెళ్లే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పశుకాపర్లు కూడ అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని సూచించారు. ప్రయాణాలు చేసేవారు కూడ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ విషయంపై గ్రామాల్లో దప్పుచాటింపు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## ఆర్థిక సాయం

రెబ్బెన, ఏప్రిల్ 4 : రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్లూరి గణపతి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు గురువారం రూ.5వేల ఆర్థిక సాయం రెబ్బెన సీఐ చిట్టిబాబు చేతుల మీదుగా అందించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియలకు ఉపయోగపడుతాయని నగదు సాయం అందించడం జరిగిందని తెలిపారు.

## అటవీ శాఖ అధికారుల సమన్వయ లోపంతో రైతులు మృతి

చింతలమానేపల్లి, ఏప్రిల్ 4 : ఏనుగు దాడిలో మరణించిన బూరెపల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్ కుటుంబాన్ని గురువారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ అధికారుల సమన్వయ లోపంతోనే కాగజ్‌నగర్ డివిజన్‌లో రెండు నిండు ప్రాణాలను ఏనుగు బలిగొన్నదని అన్నారు. ఏనుగు దాడిలో చనిపోయిన రైతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మల్లయ్య, అజ్మీరా బలరాం, శంకర్, రమేశ్, సాయి ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# తాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4: వేసవి అయినందున ప్రజలకు జూన్ వరకు నిరంతరాయంగా నీటిని అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గ్రామీణ నీటి సరఫరా శాఖ, మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో వేసవి తాగునీటి నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 334 గ్రామ పంచాయతీలు, 2 మున్సిపాలిటీలు ఉన్నాయని, ఈ నెల మొదటి వారం నుంచి జూన్ మాసం వరకు జిల్లాలోని ప్రతి కుటుంబానికి తాగునీరు అందించేలా కార్యచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. గృహాలు, జనాభా, నీటి అవసరాలు, నీరు అందని ఆవాసాలు, గృహాల వివరాల ప్రకారం అందుబాటులో ఉన్న నీటి వనరులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో చేతి పంపులు, బోర్‌వెల్స్, బావుల ద్వారా నీటి లభ్యత గుర్తించాలని, వేసవి నేపథ్యంలో నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా, ట్యాంకులు వెళ్ళని ప్రాంతాలకు ఎడ్లబండిపై తీసుకెళ్లి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలోని వ్యవసాయ బావులు, బోర్‌వెల్స్ వివరాలు అందించాలని ఆదేశించారు. చేతి పంపులు, మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, సమస్యాత్మక ఆవాసాలను గుర్తించి నీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, మున్సిపాలిటీలో ప్రణాళిక రూపొందించి అందించాలని తెలిపారు. సురక్షితమైన తాగునీటిని అందించే విధంగా పైపులైన్ల మరమ్మతులు చేసే వ్యక్తులను తక్షణమే నియమించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు షామియానా, ఓఆర్ఎస్ సౌకర్యాలు కల్పించాలని, జన రద్దీ ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పశువుల దాహార్తి తీర్చే విధంగా నీటి తొట్టెలలో నీరు నిండుగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు

## లోహ గ్రామస్తులకు అవగాహన

దహెగాం, ఏప్రిల్ 4 : ఖర్జీ గ్రామ పంచాయతీ పరిధిలోని లోహ గ్రామస్తులకు ఏనుగుపై అటవీ శాఖ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. చింతలమానెపల్లి, పెంచికల్‌పేట మండలాల్లో ఏనుగు దాడి చేయడంతో ఇద్దరు రైతులు మృతి చెందగా అటవీ ప్రాంతమైన లోహలో అవగాహన కల్పించారు. ఎవరుకూడ అడవిలోకి వెళ్లవద్దన్నారు. అదే విధంగా ఏనుగు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. ఆకస్మాత్తుగా ఏనుగు వస్తే తీసుకునే రక్షణ చర్యల గురించి వివరించారు. గ్రామ చివరిలోని ఇండ్ల వారు రాత్రిపూట బయట పడుకోవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్వో శ్రీధరాచారి, ఎఫ్ఎస్‌వో రవి బాబు, ఎఫ్‌బీవోలు మధుకర్, వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


లోహలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

## చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి స్వర్ణలత

కెరమెరి, ఏప్రిల్ 4 : ఝరి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీవో మహ్మద్ అమ్జద్, ప్రత్యేకాధికారి స్వర్ణలత గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహ్మద్ వాజీద్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## నిర్ణీత కూలీ డబ్బులు పొందేలా పనులు ఉండాలి


కెరమెరి : భీమన్‌గొందిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణారావు

తిర్యాణి, ఏప్రిల్ 4 : కొలతల ప్రకారం పనులు చేసి నిర్ణీత ఉపాధి డబ్బులు పొందాలని ఈజీఎస్ ఈసీ రజిత కూలీలకు సూచించారు. మండలంలోని రోంపల్లి, తిర్యాణి, మెస్రంగూడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న కందకాలు, నీటి నిల్వ కుంటల పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలు గరిష్ట వేతనం పొందేందుకు ప్రతి కూలీ నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. వర్షపు నీరు వృథా పోకుండా భూగర్భజలాలు పెంపొందించేందుకు ఎక్కువ శాతం కందకాలు, నీటి నిల్వ కుంటలు, ఫాంఫండ్ పనులు చేయించడం జరుగుతుందన్నారు. ఈ పనులపై టీఏ, ఎఫ్ఏలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేసవిలో ఉదయం 10 గంటలలోపే పనులు ముగించుకొని ఇంటికెళ్లాలని సూచించారు. ఆమె వెంట పవన్ కుమార్ ఉన్నారు.

### ఉపాధి హామీ పనుల పరిశీలన

కెరమెరి, మార్చి 4 : భీమన్‌గొంది గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు. ఎండల నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాట్లు తీసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఉదయం పూట పనులకు వెళ్లి ఎండలు ముదరకముందే ఇంటికి చేరుకోవాలన్నారు. పనుల్లో కూలీల సంఖ్య పెంచడంతో పాటు పని ప్రదేశంలో తగిన సౌకర్యాలు కల్పించాలని టీఏ, ఎఫ్ఏలకు ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ


ఉట్నూర్‌రూరల్: ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అధ్యాపకులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : విజ్ఞాన ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉట్నూర్ విద్యార్థులు మ్యాథమెటిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ శ్రావణి ఆధ్వర్యంలో విద్యార్థులు పూజ, చంద్రకళ, నగేశ్, శేఖర్, అమృత్ నిత్య జీవితంలో మ్యాథమెటిక్స్ ఉపయోగాలు ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని రూసా రిసోర్స్ సెంటర్‌లో తమ ప్రాజెక్టును, అందులోని విశేషాలను విజయవంతంగా ప్రదర్శించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 4: నిత్య జీవితంలో గణితం యొక్క ఉపయోగాలు అనే అంశంపై హైదరాబాద్‌లోని రూసారిసోర్స్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గురువారం కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జాడి రవికిరణ్ ప్రాజెక్టు రూప కల్పనలో సహకరించిన గణిత అధ్యాపకురాలు డాక్టర్ శ్రావణి, విద్యార్థులు పూజ, చంద్రకళ, నగేశ్, శేఖర్, అమృత్‌కు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంగీత, శ్రీధరదేవి, రాణి, జావిద్, రాజశేఖర్, రవీందర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న ఏఎస్ఐ

కెరమెరి, ఏప్రిల్ 4: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేనిచో చర్యలు తప్పవని ఏఎస్ఐ బాల్‌సింగ్ హెచ్చరించారు. గురువారం మెట్టపీప్రీ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడంతో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపిన, పత్రాలు లేకున్న జరిమానా తప్పదని సూచించారు.

## దేవర వినోద్‌కు సన్మానం

రెబ్బెన, ఏప్రిల్ 4 : ఇందిరానగర్‌లోని శ్రీ కనకదుర్గదేవి స్వయం భూ మహంకాళి ఆలయ అర్చకుడు దేవర వినోద్ ఇటీవల నంది పురస్కారం అందుకున్న సందర్భంగా గురువారం ఆలయంలో శాలువా కప్పి సన్మానించినట్లు సాంస్కృతిక సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద గోపాలకృష్ణ తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి నంది పురస్కారం అందుకోవడం చాలా గొప్ప విషయమన్నారు.


ఆలయ అర్చకుడు దేవర వినోద్‌ను సన్మానిస్తున్న గోపాలకృష్ణ

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జైనథ్, ఏప్రిల్ 4 : విద్యార్థులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సుచల అన్నారు. గురువారం గిమ్మ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో జాతీయ అయోడిన్ లోపం రుగ్మతల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సాల్ట్ సర్వే నిర్వహించారు. 90 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. సాల్ట్, యూరిన్ శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించారు. అలాగే మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి నయనథ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో అనిత, సీహెచ్‌వో అంజయ్య, ఏఎన్ఎంలు ,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆపిల్ తోట సందర్శన

జైనథ్(బేల), ఏప్రిల్ 4 : బేలలోని కీర్తన డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర, చరిత్ర విద్యార్థులు గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం ధనోర గ్రామంలోని సేంద్రియ వ్యవసాయ క్షేత్రంలో ఆపిల్ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ వృక్ష శాస్త్ర అధ్యాపకుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ వరప్రసాద్‌రావ్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఆపిల్ పంటల సాగు చాలా అరుదు అన్నారు. ఆపిల్‌తో పాటు వాటర్ ఆపిల్ ఇంకా అనేక పంటలను ఇక్కడ సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. యువకులు కొత్త పంటలు సాగు చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. అదేవిధంగా చరిత్ర విద్యార్థులు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడెఘాట్‌లోని కుమ్రం భీం సమాధి, మ్యూజియం సందర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గేడం ప్రవీణ్, సీనియర్ అధ్యాపకులు అమోల్, సంజీవ్, బిందు, సౌందర్య, హెర్బరియం కీపర్ అర్చన పాల్గొన్నారు.


జోడెఘాట్‌లో విద్యార్థులతో అధ్యాపకులు, ప్రిన్సిపాల్

# స్వేచ్ఛగా ఓటేయండి


కవాతును జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు

వాంకిడి, ఏప్రిల్ 4 : లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు హక్కును స్వేచ్ఛంగా వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు కోరారు. గురువారం ఖమాన గ్రామంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలు, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు సాగర్, రాములు, పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ.ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాను సమర్థవంతంగా నిర్వహించాలి


వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4: తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. గురువారం ఆసిఫాబాద్ మండలం మాణిక్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా నిర్వహణను డివిజనల్ పంచాయతీ అధికారి అహ్మద్ ఒమర్ హుస్సేన్, డిప్యూటీ ఈఈ మతిన్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం పూర్తయ్యే వరకు ప్రతి ఇంటికి సరిపడే విధంగా తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో నల్ల కలెక్షన్లు, బోర్‌వెల్ ద్వారా నీటిని అందించడం జరుగుతుందని, నీటి వనరులు అందుబాటులో లేనిచో మారుమూల ప్రాంతాలకు నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. అలాగే అంగన్ వాడీ కేంద్రాలకు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి సరఫరా, సమస్యలు, చేపట్టిన పరిష్కారాలపై ప్రతి రోజూ నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈఈ లు, పంచాయితీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కుష్టు రహిత సమాజాన్ని నెలకొలపాలి


వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న జిల్లా కుష్టు నిర్మూలన అధికారి సుధాకర్ నాయక్

దహెగాం, ఏప్రిల్ 4 : కుష్టు రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కుష్టు నిర్మూలన అధికారి సుధాకర్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అయినం గ్రామంలో కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 రోజుల పాటు వైద్య సిబ్బంది అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రాథమికంగా కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించారని పేర్కొన్నారు. మండలంలో 100 మందిని గుర్తించగా గురువారం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయి నిర్ధారణ చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 76 మంది వైద్యం చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా వారికి ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులను రెండు రకాలుగా గుర్తించడం జరుగుతుందని క్యాటగిరి-1 ఒక మచ్చ(పీబీ), క్యాటగిరి-2 ఐదు మచ్చలపైన(ఎంబీ) నిర్ధారించి క్యాటగిరి-1 వారికి 6 నెలల వైద్యం, క్యాటగిరి-2 వారికి 12 నెలల వైద్యం(ఎండీటీ మందులు) ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 830 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని వారికి చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్పందన, సీహెచ్‌వోలు సంపత్, వెంకట్, ఎంఎల్‌హెచ్‌పీలు మల్లికార్జున్, జ్యోతి, రవళి, నరేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి


మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్యాధికారి కుడ్మెత మనోహర్

నార్నూర్, ఏప్రిల్ 4 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అదనపు జిల్లా వైద్యాధికారి కుడ్మెత మనోహర్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాశాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఉంటాయని, ప్రతి ఆశ కార్యకర్త అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండేలా చూడాలన్నారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని, వంద శాతం ప్రసవాలు దవాఖానలో జరిగేలా ప్రోత్సహించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్, వైద్యాధికారి రాంబాబు, సీహెచ్‌వో లక్ష్మి, హెచ్‌ఈవో తులసీదాస్, పీహెచ్ఎన్‌వో సుశీల, హెల్త్ సూపర్ వైజర్ చరణ్‌దాస్, సత్తవ్వ, సిబ్బంది పాల్గొన్నారు.

## 10న విగ్రహావిష్కరణ

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 4: సాలేవాడ(కే) గ్రామంలో ఈ నెల 10వ తేదీన అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించాలని న్యాయవాది కొమ్ము విజయ్ అన్నారు. గురువారం విగ్రహావిష్కరణ కమిటీ నాయకులతో కలిసి ఆయన నివాసంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు గౌతమ్, సుభబూష్ వావల్కర్, కాంబ్లే ప్రజ్ఞశీల్, వికాస్ పాల్గొన్నారు.